
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 26 జూన్ 2024

పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించాలి 8

పెరుగుతున్న ఇసుక మాఫియా ఆగడాలు 8



చేనేత సంఘాల ఎన్నికలకు కసరత్తు

- చివరగా 2013లో ఎన్నికలు
- తాజాగా జాబితా సిద్ధం చేస్తున్న చేనేత జౌళి శాఖ
- జూలైలో నిర్వహణకు ఏర్పాట్లు
- ఇప్పటికే ఇతర సహకార సంఘాల ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

చేనేత సహకార సంఘాల ఎన్నికలకు ఎట్టకేలకు కసరత్తు ప్రారంభమైంది. పాలకవర్గాల గడువు ముగిసి ఆరేళ్లవుతోంది. ఇన్నేళ్లకు ముహూర్తం దొరికింది. వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న అన్ని సహకార సంఘాల కార్యవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల అథారిటీ సూచనల మేరకు జిల్లా సహకార శాఖ అధికారులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలకు, ఇతర సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు చేనేత జౌళి శాఖ సభ్యుల జాబితాను సిద్ధం చేస్తోంది. ఐదేళ్లకోసారి నిర్వహించాల్సిన చేనేత సహకార సంఘాల ఎన్నికలు 2013లో చివరి సారిగా నిర్వహించారు. వీరి పదవీ కాలం 2018 ఫిబ్రవరితో ముగిసింది. అసమయంలోనే ఎన్నికలు నిర్వహించాలని 40 రోజుల ముందే నోటిఫికేషన్ జారీ చేసే విధంగా చేనేత కార్మికులతో ఓటు హక్కు అర్హత కలిగిన జాబితాను జౌళిశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మరోసారి ఎన్నికల నిర్వహణకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. కానీ చేనేత సహకార సంఘాల్లో మాత్రం ఎన్నికల నిర్వహణపై అనుమానాలే వ్యక్తం అవుతున్నాయి. మళ్లీ దాటవేస్తారనే సందిగ్ధం మాత్రం వీడడం లేదు.

● ప్రశ్నార్థకంగా చేనేత సంఘాల ఉనికి..

చేనేత మగ్గం వారి జీవనాధారం. కంటి చూపు అనకపోయినా, వినికిడి జ్ఞానం కోల్పోతున్నా కాసేపు పనిచేస్తేనే ఒళ్లంతా నిస్సత్తువుగా మారుతున్నా వృద్ధాప్యంలో చేనేత మగ్గాలపైనే ఉపాధి పొందుతున్నారు. యువకులు మరమగ్గాల వైపు వెళ్లడంతో జిల్లాలో చేనేత మగ్గాలు లయ తప్పాయి. వేల సంఖ్యలో ఉన్న మగ్గాలు ఇప్పుడు వందల సంఖ్యకు చేరాయి. చేనేత సహకార సొసైటీలు మూలనపడ్డాయి. ప్రస్తుతం జిల్లాలో రికార్డుల ప్రకారం 13 సొసైటీలు ఉన్నాయి. ఆరు సొసైటీలు మాత్రమే పని చేస్తున్నాయి. చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు చేరాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 35 వేల మరమగ్గాలపై బట్ట ఉత్పత్తి చేస్తున్నారు. 1984లో సిరిసిల్ల జిల్లాలో చేనేత మగ్గాలు ఆరు వేల వరకు ఉండగా ఇప్పుడు 204 మగ్గాలకు చేరుకున్నాయి. ఈ మగ్గాలపై 325 మంది కార్మికులు మాత్రమే ఉపాధి పొందుతున్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత మిత్ర పథకాలను అందిస్తున్నారు. నూలు సబ్సిడీని ఇస్తున్నారు. ఈ పథకం ద్వారా 384 మంది కార్మికులకు రూ.4.21 లక్షలు విడుదల చేశారు. రూ.లక్ష వరకు రుణమాఫీ చేశారు. చేనేత కళను బతికించడానికి కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం 2017లో చేనేత లక్ష్మి పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధ శాఖల ఉద్యోగులు 2662 మంది పథకంలో చేరారు. చేనేత లక్ష్మీ పథకంలో చేరిన ఉద్యోగులు దుస్తులు కొనుగోలు చేశారు. ఈ పథకం మళ్లీ కొనసాగలేదు. వేములవాడ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్‌గా గుర్తించింది. క్లస్టర్ కింద రూ.1.19 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ.50 లక్షలతో మౌలిక వసతుల కేంద్రం ఆధునిక డిజైనతో కార్మికులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టింది. మొదటి విడతలో రూ.19.10 లక్షలు విడుదల చేయగా 300మంది లబ్ధిదారులు కొత్త డిజైన్ల అభివృద్ధి, చేనేత శిక్షణను పొందారు. జిల్లాలో 175 మగ్గాలు ఉండగా అందులో కొన్ని వినియోగంలో లేవు. జిల్లాలో సిరిసిల్లలో 76 మగ్గాలు, వేములవాడలో 4, వేములవాడ మండలంలో 7, చందుర్తి 8, బోయినపల్లి 27, తంగళ్లపల్లి 34, ఇల్లంతకుంట 4, గంబీరావుపేట 1, కోనరావుపేట 14 ఉన్నాయి. ఇందులో సిరిసిల్లలో మహేశ్వర సొసైటీ, సిరిసిల్ల సొసైటీ, జగదాంబ సొసైటీ, వేములవాడ, హన్మాజీపేట, మామిడిపెల్లి సొసైటీ తోపాటు ఖాదీగ్రామోద్యోగ, తంగళ్లపల్లి సొసైటీల్లో చేనేత మగ్గాలు కార్మికులకు ఉపాధిని అందిస్తున్నాయి. చేనేత కార్మికుడికి పదిహేను రోజులపాటు కష్టపడితే రూ.500 నుంచి రూ.800 వరకే కూలి లభిస్తోంది. చేనేత మగ్గాలకు కండెలు చుట్టే వృద్ధ మహిళలు ఒక నూలు లడి చుడితే రూ.6 నుంచి 10 రూపాయలు మాత్రమే లభిస్తాయి. పొద్దంతా చుడితే 50 రూపాయలు మాత్రమే గిట్టుబాటు అవుతుంది. చీరలోని గొప్పతనాన్ని చాటుతూ అగ్గిపెట్టెలో సైతం అమిరే చీర, కుట్టులేని దుస్తులు, మగ్గంపై మనుషుల చిత్రాలను నేసి ప్రపంచాన్ని అబ్బుర పరిచి సిరిసిల్ల చేనేత పరిశ్రమ ఉనికిని మాత్రం కొందరు యువకులు బతికించే ప్రయత్నం చేస్తున్నారు. వారుకూడా మరమగ్గాలపైనా ప్రయోగాలు చేయడంపై దృష్టి పెట్టారు.

ఎన్నికలకు ఏర్పాట్లు



- సాగర్, చేనేత జౌళి శాఖ ఏడీ

చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని చేనేత సంఘాల సభ్యుల వివరాలు, ఓటరు జాబితాలను సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వానికి నివేదికలు అందించనున్నాం.

పత్తి రైతుల కష్టాలు



మళ్లీ విత్తనాలు విత్తుతున్న మహిళా కూలీలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 25: తొలకరి జల్లులతో దుక్కులు దున్నిన అన్నదాతలు పత్తి విత్తనాలు విత్తారు. వరుణుడు ముఃఖం చాటేయడంతో కొన్ని విత్తనాలు మొలకెత్తి మరి కొన్ని దుక్కుల్లోనే మాడిపోయాయి. పత్తి చేనులో మొలకెత్తని చోట మళ్లీ విత్తనాలను కొనుగోలు చేసి పెడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో పత్తి రైతులకు కష్టాలు తప్పడం లేదు. మండల కేంద్రంతో పాటు రాగట్లపల్లి, గొల్లపల్లి, రాజన్నపేట, దుమాల, అక్కపల్లి, అల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లోని పత్తి రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ విత్తనాలను విత్తుతున్నారు. విత్తనాలు, కూలీలకు ఎకరానికి రూ. 3వేలు అదనంగా ఖర్చవుతోందని రైతులు పేర్కొంటున్నారు.

నేడు సెస్ 50వ మహాసభ

సిరిసిల్ల రూరల్, జూన్ 25: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ 50వ మహా సభను బుధవారం నిర్వహించనున్నట్లు ఎండీ శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో చైర్మన్ చిక్కుల రామారావు అధ్యక్షతన జరిగే ఈ మహాసభకు ప్రతినిధులు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, జూన్ 25: వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులు, ల్యాబ్, మందుల నిల్వ, ప్రసవ గది, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రిలోని మందుల నిల్వ చేసే గది పైకప్పుకు వాటర్ కలర్, పడక గదికి దోమ తెరలు, జనరేటర్ నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని రేకుల షెడ్డులో మరమ్మతు పనులు చేయాలని, 20 పడకలను వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ కావడం వల్ల జిల్లా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న తాము ఇక్కడ సేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ బాబు వివరించారు. సీహెచ్‌సీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారా? నిధులు మంజూరయ్యాయా? అని కలెక్టర్ ప్రశ్నించారు. గ్రామంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల ఎదుట స్థల పరిశీలన చేశామని తహసీల్దార్ రామచంద్రం పేర్కొన్నారు. పీహెచ్‌సీ సేవలపై ఇన్‌చార్జి వైద్యురాలు స్రవంతిని అడిగి తెలుసుకున్నారు. భవనం లేదని, మందుల కోసం సీహెచ్‌సీకి రోగులను పంపిస్తున్నామని పేర్కొన్నారు. దాంతో పీహెచ్‌సీ భవన నిర్మాణాల పనులు ఏమిటని ప్రశ్నించారు. బండలింగంపల్లిలో స్థల పరిశీలన చేశామని వివరించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలను అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రామచంద్రం, సీహెచ్‌సీ సూపరిండెంట్ బాబు, పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యురాలు స్రవంతి తదితరులు ఉన్నారు.

పశు వ్యాధులపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 25: వర్షాకాలంలో పశు సంపదకు వచ్చే వ్యాధులపై పెంపకందారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం పశు సంవర్ధక శాఖ అధికారులతో పశు సంపదకు సంక్రమించే వ్యాధులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పాడి పరిశ్రమల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో వాటికి వచ్చే వ్యాధులపై గ్రామీణ ప్రాంతాల వారీగా అవగాహన కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, ఏడీ డాక్టర్ రమణామూర్తి, డాక్టర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కవులు, రచయితలు



కలెక్టర్‌కు పుస్తకం అందజేస్తున్న కవులు, రచయితలు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 25: జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందీప్‌కుమార్ ఝాను మంగళవారం కవులు, రచయితలు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో పుస్తకాలను అందజేశారు.మానేరు రచయితల సంఘం కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, ఉపాధ్యక్షుడు బూర దేవానందం, యువవిభాగం కార్యదర్శి అంకారపు రవి, గుండెల్లి, వంశీ, అఫీజ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టేందుకు ర్యాలీ

సిరిసిల్ల క్రైం, జూన్ 25: మత్తు పదార్థాల వ్యతిరేక దినం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి బుధవారం ఉదయం 9.30గంటలకు ప్రారంభమై అంబేడ్కర్‌నగర్, నేతన్న చౌక్, గాంధీనగర్ మీదుగా కొనసాగుతుందని తెలిపారు. గంజాయి రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట, జూన్ 25: కృష్ణా అంగారక చతుర్థి సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని గీతా మందిరంలో మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవల్లిదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తిలకించారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 25: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని, ఉద్యోగాలను సాధించి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని సిరిసిల్ల సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనజకుమారి అన్నారు. పట్టణంలోని కళాశాలలో 2023 -2024 విద్యా సంవత్సరం ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. ప్రణాళికతో ముందుకెళ్తే తప్పకుండా విజయం వరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాము, దీప్తి, శ్రీనివాస్, ప్రవీణ్, నవీన్, గంగారాజు, జబీవుల్లా, అఫ్రోజ్ సుల్తానా, అనిత పాల్గొన్నారు.

యువత గంజాయికి అలవాటు పడవద్దు

వీర్నపల్లి, జూన్ 25: అటవీ గ్రామాల్లోని యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రం, బంజేరు, మద్దిమల్ల గ్రామాల్లో మీకోసం కార్యాక్రమంలో భాగంగా పోలీస్ కమ్యూనిటీ సమావేశాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నేరాల నియంత్రణకు పూర్తి సహకరించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. ఎస్సై రమేష్, ఏఎస్సై రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి విక్రయాలు

- అవగాహన కల్పించని అధికారులు
- రాజన్న భక్తుల ఇబ్బందులు



రోడ్డును ఆక్రమించిన దుకాణాదారులు

వేములవాడ టౌన్, జూన్ 25: వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ సమీపంలో పలు దుకాణాదారులు రోడ్డును ఆక్రమించి విక్రయాలు చేపడుతున్నారు. దీంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా నుంచి బద్దిపోచమ్మ ఆలయానికి వెళ్లే దారి ఎప్పుడు భక్తులతో రద్దీగా ఉంటుంది. రోడ్డుకు ఇరువైపుల ఉన్న బొమ్మల దుకాణాలతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాదారులు రోడ్డుపై స్టాండ్‌ల పెట్టి సామగ్రి విక్రయాలు చేపడుతున్నారు. దీంతో రోడ్డు వెడల్పు తగ్గిపోయి ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందని స్థానికంగా ఉంటున్న ఇళ్ల యజమానులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బద్దిపోచమ్మ ఆలయానికి ఆటోలో వచ్చే భక్తులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ రోడ్డులోకి ఆటో వస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అధికారులు స్పందించాలని, రోడ్డును ఆక్రమించి విక్రయాలు చేస్తున్న వారికి అవగాహన కల్పించాలని, దుకాణాల పరిధిలోనే విక్రయాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, స్థానిక ఇళ్ల యజమానులు కోరుతున్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



సదస్సులో పాల్గొన్న అధికారులు, రైతులు

సిరిసిల్ల రూరల్, జూన్ 25: వానాకాలంలో పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట జిల్లా రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం సదస్సు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, నాగర్ కర్నూల్ జిల్లా పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధక స్థానం సహాయ పరిశోధక సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి పలు అంశాలను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలోఅధికారులు సూచించినఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, సిరిసిల్ల వ్యవసాయ అధికారులు సందీప్‌కుమార్, భూమిరెడ్డి, రైతులు చెన్నమనేని కమలాకర్‌రావు, పబ్బతి విజయేందర్‌రెడ్డి, కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

వానలు కురవాలని..



దేవాలయం వద్ద నీటి బిందెలతో మహిళలు

సిరిసిల్ల టౌన్, జూన్ 25 : వర్షాలు సమృద్ధిగా కురవాలని మంగళవారం సిరిసిల్ల పట్టణం 36వ వార్డు మహిళలు స్థానిక వెంకంపేటలోని హనుమాన్ దేవాలయం, పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంజన్న, పోచమ్మతల్లి విగ్రహాలకు జలాభిషేకం చేశారు. వార్డు కౌన్సిలర్ కల్లూరి రాజు, నాయకులు గడ్డం వెంకటేష్, కొక్కుల నర్సయ్య, బొల్లి అంబదాస్, అంబాల మల్లేశం పాల్గొన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 25: సిరిసిల్ల వస్త్ర పరిశ్ర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, కార్మికుల ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, లాల్ బహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి మంగళవారం కరీంనగర్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, పవర్‌లూం కార్మికులను ఆదుకోవాలని కోరుతామన్నారు. రెండు రోజుల్లో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని ముఖ్యులతో సీఎం చర్చలు జరిపే విధంగా చూస్తామన్నారు. నాయకులు వేణు, రవి మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోతోందన్నారు. ఉపాధి లేక కార్మికులు ఆత్మహత్య చేసుకుకంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సిరిసిల్లలో కార్మికుల ఆత్మహత్యలపై స్పందించక పోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించకపోతే గతంలో మాదిరిగా సిరిసిల్లలో కార్మికుల ఆత్మహత్యలు పునరావృతం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. బాధిత కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, బతుకమ్మ చీరల బకాయిలు పూర్తిగా ఇవ్వాలని అన్నారు. గతం మాదిరిగానే వస్త్ర పరిశ్రమకు విద్యుత్‌పై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆర్డర్లు సిరిసిల్లకు ఇచ్చి వస్త్ర పరిశ్రమను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు మంద సుదర్శన్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

I, AMUNDHA ILAIAH S/O AMUNDHA KOMRAIA, R/O.H.NO.2-47, VELICHALA, RAMADUGU, KARIMNAGAR,HAVE CHANGED MY SURNAME "EMUNDLA ILAIAH S/O EMUNDLA KOMRAIAH.

AJK-15604

CHANGE OF NAME

I, MINHAJ ARA TALAT, W/O. SHAKEEL AHMED MOHAMMED, R/O. H.NO.2-7-518, MUKARAMPURA, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS " MINHAJ ARA TALAT SYED. W/O. SHAKEEL AHMED MOHAMMED.

AJK-15604

PLOTS FOR SALE

★ Kuda Layout Plots for Sale & Independent Houses for Sale. Near KITS College, Erragattu Gutta, Ambala Road. Contact : Srikanth. Cell : 7013397258, 8328168015

AJW-188247

కావలెను

★ కరీంనగర్‌లోని శాతవాహన యునివర్సిటీ ఎదురుగా నెలకొల్పబడిన లైబ్రరీలో పనిచేయుటకు స్త్రీలు కావలెను. రిటైర్డ్ ఎంప్లాయికు ప్రాధాన్యత ఇవ్వబడును. సంప్రదించండి. సెల్ : 93815 15625

AJK-185976

CHANGE OF NAME

★ I, BOJJA THIRUPATHAIAH (Old Name) S/o. BOJJA MALLAIAH, H.No. 4-28/1, Polampally, Thimmapur, Karimnagar, T.S. have changed my name as BOJJA THIRUPATHAIAH TO BOJJA THIRUPATHI (New Name), S/o. BOJJA MALLAIAH in all my Records.

AJW-188150

PLOTS FOR SALE

★ Kuda Layout Plots for Sale & Independent Houses for Sale. Near Gorrekunta, Pothurajpally, Warangal. Contact : Srikanth. Cell : 7013397258, 8328168015

AJW-188249

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 99854 10640

జగిత్యాల :- సెల్: 99854 11262

మెట్‌పల్లి :- సెల్: 70131 42966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238




ఆంధ్రజ్యోతి కార్యాలయం ప్రకటనల విభాగము

కరీంనగర్ సెల్ : 99854 11278, 99859 21353, 97036 18691, 99854 10640, పెద్దపల్లి సెల్ : 95509 00238

జగిత్యాల సెల్: 99854 11262 , మెట్‌పల్లి సెల్: 70131 42966,

వేములవాడ, సిరిసిల్ల సెల్: 99854 11063

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
తారకరామ 70 - కాచిగూడ (తెలుగు 3D)
శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ (3D తెలుగు) ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
మల్లికార్జున 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
భ్రమరాంబ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
తెలుగు 2D
తెలుగు 3D
హిందీ 3D
GLOBAL CINEMAS RELEASE

రేపే బ్రహ్మాండమైన విడుదల



వరంగల్ · నిజామాబాద్ · ఆదిలాబాద్ · ఖమ్మం · మహబూబ్‌నగర్ · మెదక్ · రంగారెడ్డి · కరీంనగర్ · నల్లగొండ · రాయచూర్

కంకర వేశారు... తారు మరిచారు

● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు


కంకర వేసి వదిలివేసిన ఎరడపల్లి-గంగిపల్లి రహదారి

శంకరపట్నం, జూన్ 25: శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామం నుంచి మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామం వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనుల్లో భాగంగా కంకర వేసి తారు మరిచారు. గ్రామాల రోడ్డును జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. రోడ్డు నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2023లో పనులు ప్రారంభించారు. మొదటి విడత నిధులతో పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. అందులో భాగంగా ఎరడపల్లి నుంచి గంగిపల్లి వరకు కంకర వేసి పనులు నిలిపివేశారు. ఈ దారి గుండా మానకొండూర్ మండలంలోని పలు గ్రామాలకు, వీణవంక మండలంలోని పలు గ్రామాలకు పదుల సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు జరుపుతుంటాయి. సంవత్సర కాలంగా కంకర రోడ్డుపై ప్రయాణించిన పలువురు వాహనదారులు వాహనాలపై నుంచి పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. పాత రోడ్డు తొలగించి కొత్త రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

FAMILY ENTERTAINMENT నేడే చూడండి



పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 11.00am
లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట 11.30am
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70 - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
PARAM JYOTHI FILMS

SWEET WONDERFUL LOVE STORY నేడే చూడండి



సుదర్శన్ 35 ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 11.00,6.00 Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
మహాలక్ష్మి 70ఎంఎం ఎ/సి - కొత్తపేట
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.45,7.15
ప్రసాద్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 10.00,6.05
SUNCHIN CINEMAS THRO NTR CINEMAS 9030161717

BLOCKBUSTER SUPERHIT నేడే చూడండి



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND 11.00,2.15,6.00,9.00
మహాలక్ష్మి కాంప్లెక్స్, 70ఎంఎం - కొత్తపేట 11.15,6.15
RUSHIKESHWAR FILM DISTRIBUTOR 9849076540

దళిత కాలనీలో వెలగని వీధి దీపాలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గంగాధర, జూన్ 25: గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి దళిత కాలనీలో ఇరవై రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. గ్రామాధికారికి, విద్యుత్ అధికారులకు పిర్యాధు చేసిన మాదికాంటే మాదికాదంటు తప్పించుకుంటున్న అధికారులు. గత ఇరవై రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పిడుగు పాటడంతో దళిత కాలనీలోని వీధి దీపాలు వైర్లతో పాటు బల్బులు కిందపడ్డయి. గ్రామపంచాయతీ సిబ్బంది పది రోజులుగా తిరుగుతున్న సమస్య గుర్తించలేకపోయారు.గ్రామసిబ్బంది కేవలం వీధి దీపాలు పోతే తొర్చడం తప్ప కరెంటు సమస్య తెలువదని వాపోతున్నారు. ఇన్సులేటర్లు పలిగి లేదా వైర్లు ఎక్కడైన అల్లుకుని ఈవిధమైన సమస్య వస్తుందని గ్రామ పంచాయతీ హెల్పర్ అంటున్నారు. వారం రోజులు క్రితం ఈ సమస్యనుతెలిపిన విద్యుత్ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. దళిత కాలనీలో వీధి దీపాల కనెక్షన్ పునరుద్ధరణ చేస్తే వీధి దీపాలు ఎక్కడెక్కడ పోయాయో అమర్చుతామని సిబ్బంది తెలుపుతున్నారు.గత కొన్ని రోజులుగా వీధి దీపాలు లేక కుక్కల, విషపురుగుల బెడదతో కాలనీవాసులు బయటికి వెల్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వీధి దీపాలు లేక దొంగల భయం పట్టుకుందని అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను గుర్తించి సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


భోజనశాలను పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, జూన్, 25: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలురుల పాఠశాల, మెట్లచిట్టాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు కల్పించిన సదుపాయాలు, విద్యబోధన, భోజనం, హాస్టల్ వసతులను, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని, హాస్టల్ సదుపాయాలు ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఉన్న విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని, క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి వసతిగృహానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించి, అక్కడ చదువుతున్న వారితో కాసేపు మాట్లాడి అవసరమైన పుస్తకాలు ఉన్నయాని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులు, నిరుద్యోగులకు, ప్రవేశ పరీక్షలకు ప్రీపేర్ అవుతున్న వారికి అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రంథాలయం చుట్టు పరిశుభ్రంగా ఉంచాలని, గ్రంథాలయంకు ఎమైనా అవసరాలు ఉంటే దృష్టి తీసుకరావాలని సూచించారు. ఈయన వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆరేళ్ల రాజాగౌడ్, పాలేపు రాజాగంగారం, నాయకులు ఉన్నారు.

అంగడిలో అడ్డగోలు వసూళ్లపై విచారణ ఏది..?

● రసీదు బుక్‌లపై ఆరా తీసిన కమిషనర్


జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం

జమ్మికుంట, జూన్ 25: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పశువుల అంగడిలో అడ్డగోలు వసూళ్లపై ఆంధ్రజ్యోతి అనుబంధంలో కథనం ప్రచురితం అయిన విషయం తెలిసిందె. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. అంగడి ప్రారంభమై మూడు నెలలు కావస్తుంది, పూర్తి అయిన రశీద్ బుక్‌లు ఎందుకు వెనక్కి తీసుకోలేదు, పశువుల క్రయ విక్రయదారుల వద్ద గుత్తేదారు ఎంత వసూళ్లు చేస్తున్నారు, ఎప్పటికప్పుడు తనిఖీలు ఎందుకు చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మంగళవారం అంగడి ఉండటంతో మొదట విచారణ చేపట్టాలని బావించినట్లు తెలుస్తోంది. కానీ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు అంగడి వద్దకు వెళ్లేందుకు సాహసం చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అమాయకులైన క్రయ విక్రయదాలరులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సిన అవసరం ఉంది.

29న సదరం స్లాట్ బుక్ చేసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్ 25: జిల్లా ఆసుపత్రిలో జూలై, ఆగస్టు నెలలో నిర్వహించే సదరం శిబిరంలో పాల్గొనేందుకు ఈ నెల 29న 11.30 నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 3న ఆర్థో, జూలై 9న మానసిక, 15న కంటి చూపు, 23న వినికిడి, మూగ వారికి సంబందించిన సదరం శిబిరం నిర్వహిస్తారన్నారు. ఆగస్టు 6న ఆర్థో, 13న మానసిక, 20న కంటి చూపు, 27న వినికిడి, మూగ వారికి సంబందించిన వారికి శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. సంబంధిత వైద్య పత్రాలు, మీసేవలో బుక్ చేసుకున్న రశీదుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆదార్‌కార్డు జిరాక్స్ కాపీతో సదరం శిబిరానికి హజరు కావాలని సూచించారు.

29న కొండగట్టుకు పవన్‌కళ్యాణ్

మల్యాల, జూన్ 25: ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్‌కళ్యాణ్ ఈ నెల 29న కొండగట్టుకు రానున్నట్లు తెలిసింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడంతో పవన్‌కళ్యాణ్ కొండగట్టుకు వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారని ఆయన అభిమానులు పేర్కొన్నారు. గత ఏడాది జనవరి 24న పవన్ కొండగట్టులో పర్యటించి ఏపీలో ఎన్నికల ప్రచారానికి వినియోగించిన నూతన వాహనం వారాహికి పూజలు నిర్వహించారు. అటు తరువాతే ఏపీలో ప్రచారం మొదలు పెట్టడం, ఎన్నికల్లో పోటీ చేసిన వాటిలో మొత్తం గెలుపొందడంతో కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధికి వచ్చి పవన్‌కళ్యాణ్ పూజలు నిర్వహిస్తారని తెలుస్తోంది. డిప్యూటీ సీఎం హోదాలో పవణ్‌కళ్యాన్ కొండగట్టుకు రానున్నట్లు సమాచారం రావడంతో పవన్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

ఆర్టీసీ బస్సు.. బొలెరో వాహనం ఢీ

● బొలెరో ప్రయాణిస్తున్న ఇద్దరి మృతి ● బస్సులోని ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలు

ధర్మారం, జూన్ 25: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద రాష్ట్ర రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం డ్రైవర్ అన్వర్ పాషా(25), మరొక వ్యక్తి అబ్దుల్(55) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల డిపోకు చెందిన ఏపీ29జడ్ 2622 ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా, ఏపీ 28టిఎ8726 బొలెరో వాహనం ఎదురుగా వస్తూ ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్ అన్వర్(25), అబ్దుల్(55) అనే ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వాహన డ్రైవర్‌ది హైదరాబాద్ పరిధి ముషీరాబాద్‌లోని ఇందిరానగర్‌కు చెందిన వ్యక్తి. అబ్దుల్ గోదావరిఖనిలోని లక్ష్మీనగర్‌కు చెందిన వ్యక్తి అని గుర్తించారు. బొలెరో వాహనంలో ఇద్దరి మృతదేహాలు ఇరుక్కుని ఉండడంతో గ్యాస్ కట్టర్‌లతో కట్ చేసి బయటకు తీయాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఉమాదేవి, ఆగవ్వ అనే మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై సత్యనారాయణ చేరుకుని ఘటన వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కరీంనగర్ తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.



ధర్మారం మండలం మల్లాపూర్ వద్ద ఢీకొన్న బొలెరో, ఆర్టీసీ బస్సు

అవమానభారంతో మహిళ ఆత్మహత్య

● న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల రాస్తారోకో

హుజూరాబాద్, జూన్ 25: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మోతె అఖిల (31) అనే మహిళకు వివాహేతర సంబంధం అంటగట్టి దాడి చేయడంతో అవమానంతో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై రెండురోజుల క్రితం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మృతురాలి బంధువులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నాను విరమింపజేశారు. మృతురాలి భర్త జలేందర్ తెలిపిన ప్రకారం..ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నాగరాజు, ఆయన భార్య ఉమ, తిరుమల, రాజ్‌కుమార్‌లు తన భార్యకు అక్రమ సంబంధం అంటగట్టడంతో తన భార్య అఖిల ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు పట్టించుకోలేదన్నారు. తాము వ్యవసాయ బావులన్నీ వెతుకగా రాజిరెడ్డి బావిలో అఖిల మృతదేహం లభించిందని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా అవమానించిన వ్యక్తులకే పోలీసులు వత్తాసు పలుకుండడంతో ధర్నా చేశామన్నారు. ఇప్పటికైనా పోలీసులు న్యాయం చేయాలన్నారు. ఈ సంఘటపై అఖిల భర్త జలేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



హుజూరాబాద్‌లో ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి



బైరి సతీష్(ఫైల్)

కోల్‌సిటీ, జూన్ 25: గోదావరిఖని గాంధీనగర్‌లో నివాసముండే బైరి సతీష్(32) అనే వ్యక్తి భార్య కాపురానికి రావడం లేదనే మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. సతీష్ ప్రైవేట్ ఉద్యోగి. 2020లో అతనికి హారి కతో వివాహం జరుగగా మూడు సంవత్సరాల కూతురు ఉంది. భార్యభర్తల మధ్య వివాదాలతో విడాకులకు కోర్టును ఆశ్రయించారు. తన భార్య తిరిగి కాపురానికి వస్తానని చెప్పి, మళ్లీ తన వద్దకు రావడం లేదనే మనస్థాపంతో ఈ నెల 2న పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాత కక్షలతో హత్య

● ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, జూన్ 25: పాత కక్షల నేపథ్యంలో హత్యకు పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులకు జీవిత ఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేంపేట గ్రామానికి చెందిన ధనరేకుల రాజేందర్‌కు అదే గ్రామానికి చెందిన జెల్ల రమేష్, జెల్ల మహేష్‌లకు మధ్య పాత కక్షలతో కేసులు నమోదయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఏలాగైనా రాజేందర్‌ను హత్య చేయాలని రమేష్, మహేష్‌లు 2020 మే 19న గ్రామ సమీపంలో కత్తులతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన రాజేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య హరిణి మెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రవి కుమార్, ఎస్సై సధాకర్ కేసు నమోదు చేశారు. నిందితులైన రమేష్, మహేష్‌లను కోర్టులో ప్రవేశ పెట్టారు. కోర్టు పోలీసులు రాజు నాయక్, కిరణ్ కుమార్, రంజిత్‌లు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలు అయిన రమేష్, మహేష్‌లకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. ముద్దాయిలకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గృహిణి ఆత్మహత్య

రామగిరి, జూన్ 25: రామగిరి మండలంలోని సెంటినరీకాలనీకి చెందిన వి. శ్రీలక్ష్మి(46) మంగళవారం టాయిలెట్ క్లీనర్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం టాయిలెట్ క్లీనర్ తాగి అపస్మాకర స్థితిలో ఉన్న శ్రీలక్ష్మిని కుటుంబ సభ్యులు గుర్తించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. శ్రీలక్ష్మి మృతికి గల కారణాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పత్తి ప్రశాంత్ (ఫైల్)

కోరుట్ల రూరల్, జూన్ 25 : మండలంలోని పైడిమడుగు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మాదాపూర్ గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ (27) మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం సమయంలో మాదాపూర్ గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ తన ద్విచక్ర వాహనంపై పైడిమడుగు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పైడిమడుగు గ్రామ శివారులో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్నట్లు తెలిపారు. తీవ్ర గాయాల పాలైన ప్రశాంత్‌ను గ్రామస్థుల సహకారంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు బంధువులకు తెలిపారు. వెంటనే బంధవులు కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రశాంత్ తల్లి పోశాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తొమ్మిది వాహనాలను సీజ్ చేసిన ఎంవీఐ

హుజూరాబాద్, జూన్ 25: హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపు సమీపంలో మంగళవారం ఎంవీఐ వేణు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధిక లోడ్, సరైన పత్రాలు లేకపోవడంతో తొమ్మిది వాహనాలను సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారుడు పత్రాలు లేకుండా రోడ్లపైకి రావద్దన్నారు. అధిక మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోవాలన్నారు. రోడ్డుపై డ్రైవింగ్ నిబంధన లు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

మల్యాల, జూన్ 25: మల్యాలకు చెందిన పెరుమల్ల సుమన్‌గౌడ్ అనే గీతకార్మికుడు ప్రమాదవశత్తూ తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. తాటిచెట్టు ఎక్కి కిందకు దిగుతుండగా అదుపుతప్పడంతో కింద పడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. కాగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

విభజన హామీల అమలుకు బీజేపీ ఎంపీలు కృషి చేయాలి

భగత్‌నగర్ (కరీంనగర్), జూన్ 25: రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన సమయంలో యూపీఏ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందన్నారు. అనంతరం కేంద్రంలో ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. బయ్యారం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ లాంటి హామీలు అమలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓట్లు కొన్నిచోట్ల బీజేపీకి ట్రాన్స్‌ఫర్ అవడం వల్లనే ఆ పార్టీ అభ్యర్థులు గెలిచారన్నారు. తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర మంత్రులు బండి సంజయ్‌కుమార్, కిషన్‌రెడ్డి విభజన హామీల అమలుకు కేంద్రంపై ధైర్యంగా పోరాడాలన్నారు.సింగరేణిని ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నేత కార్మికుడి ఆత్మహత్య



నరేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 25: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీకి చెందిన ముదికొండ నరేష్ (34) అనే నేత కార్మికుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఇందిరమ్మకాలనీకి చెందిన నరేష్ గతలంలో వైపని కార్మికుడిగా పనిచేశాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. పని బంద్ చేసి జులాయిగా తిరిగేవాడు. గతంలోనూ మద్యం మత్తులో చేతి నరాలను బ్లేడ్‌తో కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన నరేశ్ ఇంట్లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● మృతుడు నరేష్ కుటుంబాన్ని జిల్లా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు పడిగెల రాజు, కోడి అంతయ్య, ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, తాటికోండ చందు తదితరులు పరామర్శించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి శ్రీనివాస్ పరామర్శించారు. రూ. 5 వేలు, చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీగాధ మైసయ్య రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు గడ్డం మధుకర్, శ్రీరాం నరేష్, కొంపెల్లి శ్యామ్, బల్ల లక్ష్మీపతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



నరేష్ కుటుంబీకులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

డీఈఈ సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, జూన్25: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటు కళాశాలల్లో రెండు సంవత్సరాల కోర్సులైన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డిపిఎస్ఈ) మొదటి సంవత్సరములో 2024-25 విద్యా సంవత్సరంలో చేరుటకు నిర్వహించే డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైయినట్లు మండలంలోని ఎల్ఎండిలో గల డైట్ ప్రిన్సిపల్ శ్రీ రాంమొండయ్య తెలిపారు. ఈ కోర్సులో చేరుటకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలని, షెడ్యూలు కులాల, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబరు1, 2024 నాటికి 17 సంవత్సరాలు ఉండాలని, గరిష్ఠ వయో పరిమితి లేదని తెలిపారు.

ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీలోగా సమర్పించాలని గడువు తేదీ సమీపి స్తున్నందున చివరి వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష 10.7.2024న ఉంటుందని, డిఈఎల్ఈడి కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుదని, డిపిఎస్ఈ మాత్రమే ఆంగ్ల మాధ్యంలో ఉంటుందని అన్నారు. కోర్సును ఏ మాధ్యమంలో చేయాలనుకుంటే ఆ మాధ్యమంలోనే ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష రాయాలన్నారు. వివరాలకు డిఈఈసెట్-2024 వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 25: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు పది మంది రైతులు 167క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,350, కనిష్ఠ ధర రూ.6,900 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 9 మంది డీబార్

గణేశ్‌నగర్ జూన్ 25: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 9 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు.రష్మిధర్ తేజ డిగ్రీ కళాశాల, కోరుట్లలో- ఒకరు, సంగమిత్ర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, హుస్నాబాద్‌లో- ముగ్గురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో- ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూరాబాద్‌లో- ఇద్దరు, చాణక్య డిగ్రీ కళాశాల, జమ్మికుంటలో- ఒకరు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖనిలో - ఒకరు. మొత్తం 9 మంది డీబార్ అయినట్లు తెలిపారు.

6న ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జూన్ 25 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరగనున్న ఎల్ఎల్‌బి ఆరవ సెమిస్టర్ పరీక్షలు జూలై ఆరవ తేదీ నుంచి పదో తేదీ వరకు జరగనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు.

నా కొడుకును నాకు అప్పగించండి

● ప్రభుత్వాన్ని వేడుకుంటున్న తండ్రి

కరీంనగర్ క్రైం, జూన్ 25: తెలంగాణకు చెందిన ఓ బాలుడు బంగ్లాదేశ్‌లో చిక్కుకుపోయాడు. తన కొడుకును తనకు అప్పగించాలని తెలంగాణకు చెందిన ఆ బాలుడి తండ్రి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. బాధితుడు 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'కి తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన తిరుపతి 2016లో ఉపాధి కోసం ముంబైకి వెళ్లి అక్కడ మీరా రోడ్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. అతనికి అక్కడే రియా అనే బంగ్లాదేశ్ అమ్మాయి పరిచయమైంది. కొంతకాలానికి వారు పెళ్లి చేసుకున్నారు. ఇద్దరికీ కూడా ఇది రెండో వివాహం. గతంలో వారు పెళ్లిళ్ల అయి విడాకులు తీసుకున్నారు. వీరి ద్దరూ రెండో పెళ్లి చేసుకున్నాక 2017లో విశాల్ అనే కుమారుడు జన్మించాడు. కొంతకాలం తర్వాత రియా మరో అబ్బాయితో ప్రేమలో పడి అతనితో వేరే కాపురం పెట్టింది. దీంతో రియాకు, తిరుపతికి విడాకులు అయ్యాయి. వీరికి పుట్టిన బాబు రియా దగ్గరే ఉన్నాడు. మూడో భర్త తమ కుమారుడిని కొడుతున్నాడని బ్లాక్‌మె యిల్ చేసి పలుసార్లు తిరుపతిని డబ్బులు అడిగింది. చివరికి బాబు తనకు వద్దంటూ తిరుపతికి ఇచ్చేసింది. బాబును తీసుకొని తిరుపతి ముంబై నుంచి తెలంగాణకు వచ్చి మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. విడాకులు తీసుకున్నప్పటికీ రియా.. తిరుపతితో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉంది. బాబును చూడాలని ఉందన రియా చెప్పడంతో నమ్మిన తిరుపతి బాబును తీసుకుని ముంబై వెళ్లాడు. అక్కడ తిరుపతిపై దాడి చేసి బాబును తీసుకుని రియా బంగ్లాదేశ్ వెళ్లింది. ముంబైలో తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. తర్వాత బంగ్లాదేశ్ నుంచి రియా బంధువులు తిరుపతికి వాట్సప్‌లో విశాల్‌ను హింసలు పెడుతూ తీసిన ఫొటోలు, వీడియోలు పంపిస్తూ డబ్బులు అడగడం ప్రారంభించారు. డబ్బులు పంపిస్తే బాబును పంపిస్తామంటున్నారు. దీంతో తిరుపతి ఇటీవల కరీంనగర్‌కు వచ్చి తన కుమారుడిని తనకు అప్పగించాలని కేంద్ర సహాయ హోంశాఖ మంత్రి బండి సంజయ్‌ని కలిసి విన్నవించాడు. మళ్లీ బండి సంజయ్‌ని కలిసేందుకు మంగళవారం తిరుపతి కరంనగర్‌కు వచ్చిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి తన గోడును వినిపించాడు.



బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న తిరుపతి(ఫైల్)



విశాల్

బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించండి

● రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్‌కు గర్షకుర్తి చేనేత సంఘం నాయకుల వినతి

గంగాధర, జూన్ 25: బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించాలని గర్షకుర్తి చేనేత సంఘం నాయకులు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం గంగాధర మండలం గర్షకుర్తి చేనేత వర్తక వ్యాపార సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ చేనేత, జౌళిశాఖ కమిషనర్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల తరువాత మినీ సిరిసిల్లగా పేరున్న గర్షకుర్తిలో మరమగ్గాలు, చేనేత రంగంపై అనేక మంది కార్మిక కుటుంబాలు ఆధారపడ్డాయని కొన్ని సంవత్సరాలుగా ఉపాధి పొందుతూ జీవనం గడుపుతున్నారన్నారు. ఆరు నెలలుగా పనిలేక ఇతర పనులు చేయలేక కుటుంబాలు గడ్డుకాలం వెల్లదీస్తున్నాయన్నారు. గర్షకుర్తి చేనేత మరమగ్గాలకు బతుకమ్మ ఆర్డర్లు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గర్షకుర్తి చేనేత వర్తక వ్యాపార సంఘం అధ్యక్షుడు అలువాల విరోభ, అన్నల్ దాస్ శ్రీనివాస్, గుండ రాజేశం, వెంకటాద్రి, అలువాల తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, జూన్ 25: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరగా అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అంజన్న దర్శనం అనంతరం భక్తులు బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతా లు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఒకరి ఆత్మహత్య

కథలాపూర్, జూన్ 25: మండలంలోని సిరికొండలో మంగళవారం ఫిరదౌస్ (26) అనే వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. రాయికల్ మండల కేంద్రానికి చెందిన ఫిరదౌస్ కొన్నేళ్ల కిందట సిరికొండకు ఇల్లరికం వచ్చాడు. భార్య ఫిరదౌసీతో కొద్ది రోజులుగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. గొడవలు జరుగుతున్న క్రమంలో వారం రోజుల కిందట ఫిరదౌస్ రాయికల్ వెళ్లాడు. సిరికొండ-కోరుట్ల రహదారి మధ్యలో ఉన్న మామిడితోటలో ఫిరదౌస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి బాషామియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం పంపినట్టు తెలిపారు. కాగా పోలీసులు తనను వేధించారని ఫిరదౌస్ తన బంధువులకు వాట్సాప్ సందేశం పంపించినట్లు ప్రచారం జరుగుతోంది.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

రాయికల్, జూన్ 25: రాయికల్ పట్టణంలో రెండు రోజుల క్రితం 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. రాయికల్ పట్టణానికి చెందిన సింగు గంగనర్సయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవిస్తుంటాడు. తన షాపునకు బాలికను పిలిచి మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపామని చెప్పారు. ఇప్పటివరకు నిందితుడు పరారీలో ఉండగా, మంగళవారం పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ వెంట ఏఎస్సై దేవేందర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసి బస్సుకు బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

పాలకుర్తి,జూన్ 25: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం అడ్డరోడ్డు వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సుకు బైకు ఢీకొన్న సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, అందుగులపల్లి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై హరీష్ కుర్మపల్లి వైపు వస్తుండగా ఢీకొన్నట్లు తెలిసింది.

5జీ సిగ్నల్ రేడియేషన్‌పై అవగాహన ఉండాలి

● ఐఈఎస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్



ఐఈఎస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, జూన్ 25: 5జీ సిగ్నల్ రేడియేషన్‌పై ఇంజనీరింగ్ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఐఈఎస్ డైరెక్టర్ రీసర్చ్ పర్సన్ ఎ. శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో ఈఎంఎఫ్ రేడియేషన్ అవేర్‌నెస్ 5జీ, డాట్ (డీవోటీ)స్కీంల గురించి. సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఈఎస్ డైరెక్టర్ సైబర్ సెక్యూరిటీ రీసర్చ్ పర్సన్ ఎ. శ్రావణ్‌కుమార్ టెలీగ్రాం సర్వీస్ ప్రొవైడర్ జి. రాఘవరెడ్డి, వి. రాజేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. మూడేళ్లలో తెలంగాణలో దొంగతనానికి గురైన మొబైల్స్ నుంచి 40 వేల మొబైళ్లను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై 32 లక్షల ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌చౌర్యం కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 25: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన కేసులో చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కొంకటి లక్ష్మణ్‌కు కరీంనగర్ కోర్టు జైలు శిక్ష విధించిందని ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా తెలిపారు. లక్ష్మణ్ 2019లో విద్యుత్ చౌర్యానికి పాల్పడగా కోర్టు ఆదేశాలతో జరిమానా చెల్లించాడన్నారు. మళ్లీ 2021లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ విజిలెన్స్ పోలీసులు తనిఖీల్లో పట్టుబడగా కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ ఎదుట హాజరుపరచగా 52,944 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్

హైదరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన చెక్కుల గడువు ఈ నెల 27తో తీరిపోతున్నా వాటిని పంపిణీ చేయనివ్వడం లేదని.. వాటిని పంపిణీ చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. లబ్ధిదారులకు ఇప్పటికే జారీ అయిన చెక్కులను పంపిణీ చేయకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని పిటిషనర్ తరుపు న్యాయవాది పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. చెక్కుల పంపిణీ ఎలాంటి జాప్యం లేదని.. ఒకవేళ చెక్కుల గడువు తీరిపోయినా ప్రభుత్వం మళ్లీ జారీ చేస్తుందని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ నెల 27 నాటికి చెక్కుల కాలపరిమితి తీరిపోయే పక్షంలో పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఆదేశాలిస్తామని.. దీనిపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని పేర్కొంది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తంగళ్లపల్లి, జూన్ 25: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జోగం రాజు ఆదేశించారు. మంగళవారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనులు, గ్రామ పంచాయతీలకు చెందిన రికార్డులను పరిశీలించారు. సామాజిక తనిఖీ నేపథ్యంలో పనులకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 25: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడంతోపాటు డీఈవో, ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలంటూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరాల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేటు పాఠశాలల ఫీజుల దందాను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులతోపాటు చదువును వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి శివసాయి, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ లోపెల్లి రాజురావు, ఎలగందుల శ్రీనివాస్, కాసారపు నితిన్, అనిల్, గౌతమ్, సాయి, పవన్ జగన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట: ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ అక్కెం నాగ రాజు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను ప్రభుత్వం నియంత్రించలేక పోతోందని, ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు నెలకొన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఎంఈవో పోస్టులు లేకపోవడంతో విద్య పర్యవేక్షణ ఎలా సాధ్యపడుతుందో అర్థం కావ డం లేదన్నారు. బంద్‌కు పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

గ్రామ పంచాయతీ ఈవోగా రమేష్

ముస్తాబాద్, జూన్ 25: ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా మోతే రమేశ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గంభీరావుపేట మేజర్ పంచాయతీలో పనిచేసిన రమేశ్ ముస్తాబాద్‌కు బదిలీ అయ్యారు. ముస్తా బాద్‌లో పనిచేసిన ఈవో రాజు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతోపాటు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో కొద్ది రోజులు ఈవో పోస్టు ఖాళీగా ఉంది. గంభీరావుపేట ఈవోగా పనిచేస్తున్న మోతె రమేశ్ ముస్తాబాద్ ఈవోగా బాధ్యతలు చేపట్టారు.

స్పీకర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్, జూన్ 25 : అసెంబ్లీ స్పీకర్‌ను గడ్డం ప్రసాద్‌ను మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముస్తాబాద్ మండల సోషల్ మీడియా కన్వీనర్ ఏదునూరి భానుచందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు మిరుదొడ్డి భాను తదితరులు ఉన్నారు.

మత్తుకు బానిసలైతే భవిష్యత్ అంధకారం

ఎల్లారెడ్డిపేట, జూన్ 25: యువత మత్తుకు బానిసలైతే భవిష్యత్ అంధకారమవుతుందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాల నిరోధంపై మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ యువతపైనే దేశ భవిష్యత్ ఆధార పడి ఉందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. గ్రామాల్లోని ప్రజలకు మత్తు పదార్థాలతో కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్, భూమక్క, కవిత, గీత, ప్రవళిక పాల్గొన్నారు.

అద్దె కారు స్పేర్ పార్ట్స్ మార్పిడి

వేములవాడ టౌన్, జూన్ 25 : కారు అద్దెకు తీసుకున్న వ్యక్తి కారులోని స్పేర్‌పార్ట్స్‌ను విక్రయించి పోలీసులకు పట్టుబడిన సంఘటన వేములవాడ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. సిరిసిల్ల పట్టణానికి చెందిన సాయి కృష్ణ అనే యువకుడు రవికుమార్ అనే వ్యక్తికి కారు అద్దెకు ఇచ్చాడు. కిరాయి కోసం తీసుకున్న కారులోని పార్ట్స్‌ను రవికుమార్ అనే వ్యక్తి వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్డులో కారు రిపేరింగ్ సెంటర్‌లో మరో కారుకు అమర్చుతున్నాడు. కిరాయి కోసం వెళ్లిన కారు ఇంకా రావడం లేదని గ్రహించిన సాయికుమార్ జీపీఎస్ ద్వారా లోకేషన్‌ను పరిశీలించారు. స్పేర్ పార్ట్స్ మారుస్తూ కనిపించడంతో వెంటన్నే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ల్యాండ్ యుటిలైజేషన్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కరీంనగర్ రూరల్ జూన్ 25: ల్యాండ్ యుటిలైజేషన్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ రూరల్ మండల పరిషత్ కార్యలయంలో భూసర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఎంఈవోలు, ఐకేపీ సీసీలతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేను నిర్వహించాలని, క్షేత్రస్థాయిలోకి వెళ్లి వ్యవసాయ భూములకు సంబంధించిన వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సర్వేలో బాగంగా రాష్ట్రంలోని ఐదు జిల్లాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా అందులో కరీంనగర్ జిల్లా కూడా ఉందన్నారు. వ్యవసాయ భూముల్లో వ్యవసాయం చేస్తున్నారా, లేక నిర్మాణాలు ఉన్నాయా, ప్లాటింగ్ చేశారా అనే వివరాలపై సమగ్రంగా సర్వే నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

భగత్‌నగర్, జూన్ 25: విద్యాసంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం నగరంలోని ట్రినిటీ కళాశాలలో రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కార్పోరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి జాతీయ విద్యావిధానాన్ని తీసుకు వచ్చిందన్నారు. నీట్ పేపర్ లీక్ అవకతవకల మరువక ముందే దేశ వ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షను రద్దుచేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడమేనన్నారు. నీట్, యూజీసీ నెట్ పరీక్షలో జరిగిన అవతవకలపై సుప్రీం కోర్టు జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలన్నారు. బాధ్యులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా ప్రైవేటు కళాశాలలు వేధిస్తున్నాయన్నారు. గడిచిన పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు, ఎన్ని ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. రాముడిని, హిందూ మతాన్ని మోదీ హైజాక్ చేశారన్నారు. చేగువేరా, భగత్‌సింగ్‌లాంటి విప్లవకారులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థి సంఘాలు ఉద్యమించాలన్నారు. ఈ సందర్భంగా ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థలోని విధానాలపై ప్రశ్నించాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొయ్యడ సృజన్‌కుమార్, నాయకులు మంద పవన్, మహేందర్, రఘురాం, సోతుకు ప్రవీణ్, రాజు, మచ్చ రమేష్, జనార్దన్, అంజి, సంతోష్, వెంకటేష్, శరత్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, జూన్ 25: మండలంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్, ప్రతిమ ఫౌండేషన్ సయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణ ఉపాధి కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్, టైలరింగ్ (మహిళలకు), బెడ్ సైడ్ నర్సింగ్ కోర్సు (మహి ళలకు), రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నాగారం శిక్షణ కేంద్రంలో ఫ్రంట్ ఆఫీస్ (ఎంఎస్ ఆఫీస్ కంప్యూటర్) కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పదవ తరగతి పూర్తయి, 18 ఏళ్లు కలిగి ఉండాలని, ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 30వ తేదీలోపు 9963347142 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించాలి

● మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి కరుణ

● వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 25: అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ మాట్లాడుతూ ఆరేళ్లగా పిల్లల సంక్షేమం కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధి కార్యాచరణ, పిల్లలకు నేర్పాల్సిన పాఠ్యాంశాలు, పిల్లల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల ప్రణాళిక రూపొందించామన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని చిన్న వయసులో పిల్లలకు నేర్పాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, అంశాలు, నైపుణ్యాలతో కోర్సు సిద్ధం చేశామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక బుక్ లెట్ రూపొందించామని, జూలై మొదటి వారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా



పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ అంగన్‌వాడీ సెంటర్‌లో ప్లే మ్యాట్ ఏర్పాటు చేయాలని, దీనిని రాష్ట్ర స్థాయి నుంచి అందిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో సంక్షేమ శాఖ వద్ద అందుబాటులో ఉన్న నిధులతో ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వాల్ పెయింటింగ్స్ వేయించాలన్నారు. కేంద్రాల్లో సివిల్ వర్క్స్ కోసం మంజూరు చేసిన నిధులతో తాగునీరు, అవసరమైన మేర టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న అంగన్‌వాడీ శిక్షణ కార్యక్రమాలను కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలకు ఏక రూప దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జూలై నెలలో అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. పోషక లోపం గల పిల్లలను అంగన్‌వాడీ టీచర్ల ద్వారా గుర్తించాలని, వారికి అదనపు పౌష్టికాహారం అందించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లల ఎదుగుదల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, వయసుకు తగిన బరువు ఎత్తు లేని పిల్లలను గుర్తించాలని అన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు దివ్యాంగ సర్టిఫికెట్ త్వరితగతిన అందేలా చూడాలని, సదరం క్యాంపులో అవసరమైన మేర స్లాట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రేపు నేతన్న దీక్ష

సిరిసిల్ల రూరల్, జూన్ 25: బతుకమ్మ చీరలకు సంబంధించి మరమగ్గాల కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీ చెల్లించాలని గురువారం సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట నేతన్న దీక్షను చేపట్టనున్నట్లు సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ ప్రకటించారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మరమగ్గాల కార్మికులకు యారన్ సబ్సిడీని కాలయాపన చేయకుండా అధికారులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న చేపట్టనున్న దీక్షను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సిరిమల్ల సత్యం, అన్నల్‌దాస్ గణేష్, రాజమౌళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

ముస్తాబాద్, జూన్ 25 : కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు అన్నారు. మండలంలోని గన్నెవానిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నిమ్మవానిపల్లెకి చెందిన నిమ్మల ప్రభాకర్ అనే బీఆర్ఎస్ కార్యకర్త రెండు నెలల క్రితం విద్యుదాఘాతంతో మరణించాడు. బాధిత కుటుంబానికి అండగా ఉండేందుకు పార్టీ నుంచి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తన్నీరు గౌతంరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, బత్తుల అంజయ్య సీనియర్ నాయకులు చీటి నర్సింగరావు, గాడిచర్ల దేవయ్య, గుంటుక శ్రీకాంత్, నిమ్మల విష్ణు, గన్నె నర్సింలు, రేపాక బాల్‌నర్సు, దేవేందర్, నిమ్మల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కనగర్తిలో పశువైద్య శిబిరం

కోనరావుపేట, జూన్ 25 : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో మంగళవారం కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ వ్యాధుల పరీక్షలు, గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్లు వేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. పశు వైద్యులు రాములు, సాగర్, అగ్రహారం డెయిరీ మేనేజర్ రవి, సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, కనగర్తి చైర్మన్ లక్ష్మారెడ్డి, పందెం రాజు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్

బోయినపల్లి, జూన్ 25: బోయినపల్లి మండలం భారతీయ జనతాపార్టీ యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా సూదుల సాయికుమార్‌ను నియమిస్తూ బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనకటి హరీష్ మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. మండలంలోని బూరుగు పల్లి గ్రామానికి చెందిన సాయికుమార్‌ను మండల ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 25: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియెట్ కార్యాలయం ఎదుట మం గళవారం బీఆర్ఎస్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు కళాశాలలకు వచ్చి చదువుకుంటున్నారని, వారికి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని కోరారు. నాయకులు మట్టె శ్రీనివాస్, ఒగ్గు అరవింద్, కోడం వెంకటేష్, నవీన్, నరేష్, తిరుపతి, భాను పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన అధ్యాపక బృందం

కోనరావుపేట, జూన్ 25: కోనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించింది. మోడల్ స్కూల్‌లో చదివిన విద్యార్థులు దాసరి జాషువా ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 470కి 465, బుర్రవేణి శ్రీజ బైపీసీలో 440కి 436, వంకాయల సంజన బైపీసీలో 440కి 432 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించడంతో విద్యార్థులను ప్రిన్సిపాల్ సాగర్ అభినందించారు.

రాజన్నను దర్శించుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

వేములవాడ కల్చరల్, జూన్ 25 : వేములవాడ రాజరాజేశ్వరస్వామిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ దర్శించుకున్నారు. గుండెకు శస్త్ర చికిత్స అనంతరం కోలుకుని ఇంటికి తిరిగివచ్చిన రామకృష్ణ మంగళవారం ఉదయం రాజన్న ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. హర్యానా గవర్నర్ బండార్ దత్తాత్రేయ రామకృష్ణకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతాప రామకృష్ణను రాజన్న ఆలయ సూపరిండెంట్ సిరిగిరి శ్రీరాములు, పలువురు బీజేపీ నేతలు పరామర్శించారు.

● వేములవాడ రాజరాజేశ్వరస్వామిని కేడీసీసీ బ్యాంక్ జీఎం ప్రభాకర్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేయగా, రాజన్న ప్రసాదాన్ని సూపరింటెండెంట్ తిరుపతిరావు అందించారు. సింగిల్ విండో చైర్మన్‌లు తిరుపతిరెడ్డి, కిషన్‌రెడ్డి ఉన్నారు.



ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 25: రైతు పండించిన పంటకు రూ.500 చొప్పున బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రావణపెల్లి మల్లేశం అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు, మల్లేశం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 47 లక్షల మంది రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకోవడాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం స్వాగతిస్తోందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 61 వేల మంది రైతులకు రెండు లక్షల రుణమాఫీ వర్తిస్తుందన్నారు. గత ఎన్నికల సమయంలో రైతుల రెండు లక్షల రుణమాఫీని ఏకకాలంలో అమలు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండడం హర్షనీయం అన్నారు. అదే విధంగా రైతులు పండించిన పంటకు రూ. 500 బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అశోక్, ఎల్లయ్య, చంద్రయ్య, బాలయ్య, రాజమల్లు పాల్గొన్నారు.

దేశ చరిత్రలోనే ఎమర్జెన్సీ చీకటి ఘట్టం

సిరిసిల్ల రూరల్, జూన్ 25: దేశ చరిత్రలోనే ఎమర్జెన్సీ ఒక చీకటి ఘట్టమని బీజేపీ అధికార ప్రతినిధి విఠల్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ప్రకటించిన ఎమర్జెన్సీ రోజుల్లో జరిగిన విధ్వంస కాండపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ చట్టబద్ధత, ప్రజాస్వామ్య పాలన, రాజ్యాంగ వ్యవస్థకు విలువనిచ్చే ప్రతి ఒక్కరూ ఈ రోజు బ్లాక్‌డేగా పరిగణించాలన్నారు. రాజకీయ పార్టీ అహంకారం, అధికారాన్ని అంటి పెట్టుకోవాలనే కోరిక తోనే ఎమర్జెన్సీ ఏర్పడిందన్నారు. ప్రజాస్వామ్య పునాదులను కదిలించడానికి నాటి ప్రధాని ఇందిరాగాంధీ నియంతగా వ్యవహరించడం హేయమైన చర్యన్నారు. ఎమర్జెన్సీతో లక్షా 25 వేల మంది జైలుకు వెళ్లారని, ఇందులో 90 శాతం మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలేనని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి కారెడ్ల మల్లారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నవీన్‌యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు నరేష్, పట్టణ ఉపాధ్యక్షులు చొప్పదండి అంజన్న, మోర శ్రీహరి, గాజుల సదానందం, గాజుల వేణు, అంకారపు రాజు, చేపూరి అశోక్, దుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న విఠల్

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

చందుర్తి, జూన్ 25 : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ ప్రకటించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు చందుర్తి మండల కేంద్రంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి, ముస్కు ముకుందరెడ్డి, గొట్టె ప్రభాకర్, పులి సత్తయ్య, బాణాల రవీందర్ రెడ్డి, దూది శ్రీనివాస రెడ్డి, వేల్పుల దేవస్వామి, పోతరాజు రవి, లింగంపల్లి బాబు, పుల్కం లచ్చయ్య, రవి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: రైతుల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం కాంగ్రెస్ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ పిలుపుకుంటుందన్నారు. గత ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని విమర్శించారు. ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేయడం చరిత్రలో నిలిచిపోయే అంశమన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నాయకత్వంలో మండలం అన్నిరంగాలలో ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు అంతగిరి బాలపోచయ్య, బాలరాజు, నరేందర్‌రెడ్డి, మామిడి రాజు, మచ్చ రాజేశం, వెంకటరమణారెడ్డి, మామిడి తిరుపతి, ప్రసాద్ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రహదారిపై సామగ్రి తొలగింపు

ఎల్లారెడ్డిపేట, జూన్ 25: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో రహదారిపై వరకు ఉంచిన వాణిజ్య దుకాణాల సామాగ్రి తొలగింపునకు పంచాయతీ అధికారులు, స్థానికులు మంగళవారం చర్యలు చేపట్టారు. ఈ నెల 20న బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి - సిరిసిల్ల ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగి అదే గ్రామానికి చెందిన యువకుడు ఊరడి మహేశ్ మృతి చెందడంతో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. బస్టాండ్ ప్రాంతంలోని రోడ్డు వరకు సామగ్రిని పెడుతున్న వ్యాపారులను మందలించారు. పలు టీ స్టాళ్లు, దుకాణాల వస్తువులు, కూరగాయాలు, పండ్ల బండీలను తొలగించారు. దాంతో వ్యాపారులు వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రహదారిపై సామగ్రి ఉంచితే చర్యలు తప్పవని పోలీసులు, పంచాయతీ అధికారులు హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందికరంగా సామాగ్రిని పెడితే రూ.5వేలు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

తై బజార్ వేలం

వేములవాడ టౌన్, జూన్ 25 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని తైబజార్ హక్కులను రూ.14.10 లక్షలకు దక్కించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేష్ నేతృత్వంలో తైబజార్ వేలపాటను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ల శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ రూ.14.10 లక్షలకు అత్యధికంగా వేలం పాడి టెండర్‌ను దక్కించుకున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి చెందిన దుకాణాల వేలానికి ఉత్సాహవంతులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ వేలాన్ని మరో మారు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వేములవాడ టౌన్, జూన్ 25:వేములవాడ పట్టణానికి చెందిన ఎడ్ల మహష్ అనే వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. పట్టణంలోని మహేష్ ఇంటికి వెళ్లిన ప్రభుత్వ విప్ నివాళులు అర్పించారు. ఆయన వెంట ఎడ్ల చంద్రశేఖర్, చిలుక రమేష్ తదితరులు ఉన్నారు.

వన్యప్రాణుల వేటగాడి బైండోవర్

చందుర్తి, జూన్ 25 : చందుర్తి మండలంలో వన్యప్రాణులు వేటాడుతున్న వ్యక్తిని చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన బత్తుల రాజయ్య అనే యువకుడు చందుర్తి మండలంలో వన్య ప్రాణులను వేటాడుతున్నట్లు ఎస్సై తెలిపారు.


పార్టీ ఫిరాయింపులపై గతం మరిచిన బీఆర్ఎస్

ఎల్లారెడ్డిపేట, జూన్ 25: పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ గతం మర్చిపోయిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. గతంలో కాంగ్రెస్‌కు చెందిన 12 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకొని సీఎల్పీని అప్పటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్ విలీనం చేసుకుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారనే విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. రుణమాఫీ పథకాలను దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేదని, సీఎం రేవంత్‌రెడ్డి ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ వర్తించేలా చేశారని మాజీ శాసన సభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరితే వారి దిష్టిబొమ్మలు దహనం చేయడం తగదన్నారు. ప్రజలు గత ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పినా అహంకారం పోలేదని పేర్కొన్నారు. ప్రజల తీర్పును శిరసావహించాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు తమ తీరును మార్చుకోవాలన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, రాజేందర్, రాంరెడ్డి, రఫీక్, బాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

కోనరావుపేట, జూన్ 25: కోనరావుపేట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యార్థం కరీంనగర్ రూరల్ సీఐ విజ్ఞాన్‌రావు తన తండ్రి జ్ఞాపకార్థం 25 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

పెరుగుతున్న ఇసుక మాఫియా ఆగడాలు



నామాపూర్ చెరువులో మునిగిన ట్రాక్టర్

- కానిస్టేబుల్ సహా ట్రాక్టర్ చెరువులోకి
- గాయపడిన కానిస్టేబుల్.. పరారీలో డ్రైవర్

ముస్తాబాద్, జూన్ 25: ఇసుక మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో సోమవారం రాత్రి రెచ్చిపోవడంతో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ సదన్ కుమార్ కుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలో నామాపూర్ మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో సోమవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేపట్టారు. నామాపూర్ శివారులో ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఒక్కో ట్రాక్టర్‌పై ఒక్కో కానిస్టేబుల్‌ను కూర్చోబెట్టి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐదో ట్రాక్టర్ పోలీస్ స్టేషన్‌కు రాకపోవడంతో ఎస్ఐ శేఖర్‌రెడ్డి సిబ్బందితో వెనక్కి వెళ్లి వెతికారు. మేళ్ల చెరువు కట్ట వద్ద కానిస్టేబుల్ సత్యనారాయణ అరుపులు వినిపించడంతో అటువైపు దగ్గరికి వెళ్లి చూశారు. కట్టపక్కన రాళ్లపై సత్యనారాయణ తీవ్రగాయలతో పడి ఉన్నాడు. ఏమైందని అడుగగా ఇసుక ట్రాక్టర్ నడుపుతున్న గురుబాబు అకస్మాత్తుగా దూకేసి ట్రాక్టర్‌ను కట్టపై నుంచి చెరువులోకి నెట్టేశాడని తెలిపాడు. రాళ్లపై పడిన తనకు తీవ్ర గాయాలయ్యాయని చెప్పాడు. వెంటనే 108కి ఫోన్ చేసి సత్యనారాయణను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. ప్రస్తుతం సత్యనారాయణ పరిస్థితి నిలకడగా ఉందని సీఐ వివరించారు. ప్రమాదానికి కారణమైన గురుబాబుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ చెరువులో మునిగిపోగా గురుబాబు పరారీలో ఉన్నాడని చెప్పారు.

నలుగురి రిమాండ్

మండలంలోని నామాపూర్ శివారులో మానేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నలుగురిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన నలుగురు అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేసుకొని రాత్రిపూట రవాణా చేస్తున్నారని, ఇందులో భాగంగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తులను అరెస్టు చేశామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు

ధర్మపురి, జూన్ 25: ధర్మపురి శ్రీరామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దే వాలయంలో సంకటహర చతుర్థి పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్, స్థానిక వేదపండితులు మధు రామశర్మ శాస్త్రోక్తంగా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూ జలు, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఉద యం నుంచి సాయంత్రం వరకు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెం డెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, మాజీ ధర్మకర్త గునిశెట్టి రవీందర్, అర్చకులు పాల్గొన్నారు.

మిగిలిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 25: ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో మిగిలిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దూమాల రాంనాథ్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో మంగళవారం డీఈవో రమేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్జీటీ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందని, వారికి తక్షణమే న్యాయం చేయాలని అన్నారు. ఒకటి కంటే ఎక్కువ పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు ఒక సబ్జెక్టుకు ఐచ్ఛికత తెలిపిన దరిమిలా ఒప్పందమైన వెకెన్సీలలో తక్షణమే పదోన్నతులు కల్పించి నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యతో జిల్లాలో ఉత్పన్నమైన 56 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలకు తక్షణమే పదోన్నతులు కల్పించాలని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతుల అవకాశం కల్పించాలని కోరారు.